

## అధినేతకు పరామర్శ

తుంటి గాయంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో శస్త్ర చికిత్స చేసుకొని వైద్యుల పర్యవేక్షణలో ఉన్న మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, రసమయి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, తదితరులు

### కేసీఆర్‌కు దామోదర పరామర్శ



మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శిస్తున్న మంత్రి దామోదరరాజనర్సింహ

అందోల్, డిసెంబర్ 12: కాలికి గాయం కావడంతో శస్త్రచికిత్స చేయించుకొని దవాఖానలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదరరాజనర్సింహ మంగళవారం పరామర్శించారు. మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి హైదరాబాద్‌లోని యశోద దవఖానకు వెళ్లి కేసీఆర్‌ను పరామర్శించారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై చర్చించారు.

### కేసీఆర్ కోలుకోవాలని పూజలు



దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

పాపన్నపేట, డిసెంబర్ 12: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఏడుపాయల వనదుర్గా భవానీ మాతను మొక్కుకున్నట్లు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం ఆయన వనదుర్గామాతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ బాలాగౌడ్ శంభీపూర్‌రాజును సత్కరించారు.

### రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

సిద్దిపేట కమాన్, డిసెంబర్ 12: ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్- 19 క్రికెట్ సెలక్షన్స్ సిద్దిపేట క్రికెట్ స్టేడియంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సమ్మయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. డిసెంబర్ 14 నుంచి 17 వరకు జోగులాంబ గద్వాల్‌లో జరిగే అండర్ 19 రాష్ట్రస్థాయి బాలుర క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ టీమ్‌ను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా డీవైఎస్‌వో నాగేందర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సూర్యప్రకాశ్, క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున్, క్రికెట్ అసోసియేషన్ ఫిజియో సామ మహేశ్, ఫిజికల్ డైరెక్టర్లు ఉప్పలయ్య, ప్రవీణ్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి వెంకటేశ్, రాజు, బజ్జి పాల్గొన్నారు.

# ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

**టెలీ కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్**



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 12: జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలింగ్ బూత్‌ల వారీగా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం వచ్చే దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. ఫారం 6, 7, 8 పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. జనవరి 6వ తేదీన డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయాల్సి ఉంటుందని, ఆ తర్వాత ఓటరు జాబితాకు సంబంధించి ఆక్షేపణలు, క్లెయిమ్స్‌ను జనవరి 22వ తేదీ వరకు స్వీకరించి, 2004 ఫిబ్రవరి 2వ తేదీ వరకు పరిశీలన పూర్తి కావాలన్నారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను వెలువరించాల్సి ఉంటుందని చెప్పారు. ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా ఓటర్ల జాబితా సవరింపులో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు పక్కా ప్రణాళికతో చేయాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలో ఏవైనా లోటుపాట్లు ఉంటే సవరించుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# బస్సుల్లో ఫ్రీ.. రోడ్డెక్కిన ఆటో డ్రైవర్లు



శివ్వంపేటలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

శివ్వంపేట, డిసెంబర్ 12: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటోడ్రైవర్ల ఆదాయానికి గండి పడుతున్నదని శివ్వంపేట ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం శివ్వంపేటలోని ప్రధానరహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం మొదలుపెట్టిన నాటి నుంచి గిరాకీ లేక ఆదాయం కోల్పోతున్నామని డ్రైవర్లు వాపోయారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు అర్హులైన ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.12 వేలు అందజేయాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షల బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆటో డ్రైవర్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఆటో యూనియన్ డ్రైవర్లు ఆంజనేయులుగౌడ్, నాయకులు రమేశ్, అనిల్, నగేశ్, మహేందర్‌గౌడ్, నరేశ్, శేఖర్, మహేశ్, పాండు, సురేశ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

# ప్రజలతో మమేకమై పని చేయాలి




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 12: అధికారులు, ప్రజలతో మమేకమై పని చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో పలు శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం మారిందని.. ప్రజల్లో కూడా మార్పు వచ్చిందని, ప్రభుత్వ అధికారుల పనితీరు కూడా మారాలన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. సమావేశంలో సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి, సీపీ శ్వేత, బీసీ వెల్ఫేర్ అధికారి సరోజ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు కృతజ్ఞతాభినందన సభ

నర్సాపూర్, డిసెంబర్ 12: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి విజయానికి కృషి చేసినందుకు బుధవారం నర్సాపూర్ పట్టణంలో కృతజ్ఞతాభినందన సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి వెంకట్రామ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. నర్సాపూర్ పట్టణంలోని కంజర్ల ఫంక్షన్ హాలులో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

## 23న మెదక్ జడ్పీ సర్వసభ్య సమావేశం

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 12: మెదక్ జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 23న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శైలేశ్‌వెంకట్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులంతా సమగ్ర సమాచారంతో సమావేశానికి కావాలని కోరారు.

## ఎలక్ట్రీషియన్ మృతి!

చేర్యాల, డిసెంబర్ 12: పట్టణంలోని ప్రభుత్వ దవాఖానకు చికిత్సకోసం వచ్చిన ఓ వ్యక్తి మృతి చెందాడు. వైద్యులు, సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంతోనే మృతి చెందాడని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు మండలంలోని మర్మాములలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వర్తించే అక్రమొద్దీన్(48) మంగళవారం అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులతో కలిసి చేర్యాల ప్రభుత్వ దవాఖానకు వచ్చాడు. అప్పటికే ఆయన శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడు. వైద్యురాలు పరీక్ష చేసి నెఫ్‌లైజేషన్ పెట్టాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది ఓ గంట తర్వాత నెఫ్‌లైజేషన్ పెట్టారు. అనంతరం అక్రమొద్దీన్‌కు ఈసీజీ పరీక్షలు చేయాలని వైద్యులు సూచించారు. ఈసీజీ పరీక్షలు చేసే సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో డ్యూటీలో ఉన్న వారు ఈసీజీ తీయాల్సిన సిబ్బందికి సమాచారం అందించారు. సదరు సిబ్బంది తాపీగా వచ్చి పరీక్ష చేసేందుకు యత్నిస్తున్న క్రమంలో అక్రమొద్దీన్ వాంతులు చేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి బంధువులు మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సకాలంలో పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తే ప్రాణం దక్కేదని, విధుల పట్ల అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని, కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై దవాఖాన ఇన్‌చార్జి వైద్యురాలు శ్రవంతిని ఫోన్‌లో వివరణ కోరగా అక్రమొద్దీన్‌కు సకాలంలో వైద్యం అందించామని, వైద్యులు, సిబ్బంది తప్పులేదన్నారు. దవాఖానకు తీసుకువచ్చే సమయానికే ఆయన పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

## ఇంటర్ ఫలితాల్లో మెదక్ జిల్లా ప్రథమ స్థానం సాధించాలి

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 12: ఇంటర్ ఫలితాల్లో మెదక్ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపాలని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లను మెదక్ కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన, అనుభవమున్న నిపుణులతో సబ్జెక్టుల వారీగా మెటీరియల్ తయారు చేసి విద్యార్థులకు అందజేయాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించాలని సూచించారు. డ్రాప్ ఔట్ శాతం తగ్గించాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ, వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొన్నారు.